క్లుప్తంగా

క్రీడా దుస్తులు పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన వాసగిరి రత్నమ్మ సేవా ట్రస్టు ఆర్థిక సహకారంతో క్రీడలను ప్రోత్సహిస్తూ ఆ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు వాసగిరి సాయికృష్ణమూర్తి, శోభారాణి ఆధ్వర్యంలో క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాత విజయ భాస్కర్, ఎంఈఓ ఈశ్వరయ్య

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ 2.50 లక్షల వ్యయంతో ఉచితంగా వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఆకుమల్లకు చెందిన పూర్వవిద్యార్థి, చైతన్య కళాభారతి సంస్థ చైర్మన్ విజయ భాస్కర్ ఉచితంగా స్కూల్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ ఈశ్వరయ్యతో కలసి ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. తాను చదువుకున్న పాఠశాలకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా విజయ భా స్కర్ పేర్కొన్నారు. దాత విజయ భాస్కర్‌కు హెచ్‌ఎం రామ చంద్రా రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ దూదేకుల ఉసేని, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కనకాద్రి పల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పెద్ద కుళ్లాయప్ప(65) శనివారం మృతి చెందాడు. రెండు నెలలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయనను రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు కడపలోని రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. 2003లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేశారు.

యువతి అదృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని క్రిష్ణగిరి గ్రామానికి చెందిన సత్యాల పుష్పావతి అనే యువతి అదృశ్యమైంది. ఎస్ఐ రామిరెడ్డి శనివారం అందజేసిన వివరాల మేరకు గ్రామానికి చెందిన జయచంద్రుడు కూతురు సత్యాల పుష్పావతి డిగ్రీ వరకు చదువుకుంది. ఈ నెల 28న ఇంట్లో వారికి చెప్పకుండా వెళ్లిందని, బంధువులు,స్నేహితులు వద్ద విచారించిన తెలియలేదన్నారు. ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన చింతమాను సోమశేఖర్ అనే వ్యక్తి పై అనుమానం ఉన్నట్లు జయచంద్రుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

అవుకు: ప్రభుత్వ పథకాలను ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని శింగనపల్లె, సంగపట్నం గ్రామాల్లోని ఉద్యాన పంటలను ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, ఏపిఓ ఆనీఫాతో కలిసి ఆయన సందర్శించి, పంటల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యాన రైతులకు ప్రభుత్వం నుంచి అందే పథకాలను, రాయితీలను వివరించి ప్రోత్సహించాలని సూచించారు.

పైపులైన్‌కు మరమ్మతులు

డోన్ టౌన్ : గాజులదిన్నె నుంచి డోన్‌కు మంచి నీటి సరఫరా చేసే పైపులైన్‌కు శనివారం మున్సిపల్ సిబ్బంది యుద్ధ ప్రాదిపదికన మరమ్మతులు చేపట్టారు. మండలంలోని వెంకటాపురం చెరువు కింద, కృష్ణగిరి మండలం చిట్యాల వద్ద పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతుంది. దీంతో అధికారులు అప్రమత్తమై మరమ్మతులు చేయించారు.

బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న కౌన్సిలర్

డోన్ : స్థానిక 10వ వార్డులో బోయ మధు(36) అనే యువకుడు గుండెపోటుతో శనివారం మృతి చెందారు. వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10వేలను మృతుని భార్య లక్ష్మి పార్వతికి కౌన్సిలర్ బుర్రు రమాదేవి అందజేశారు. కార్యక్రమంలో 10వ వార్డు ఇన్‌చార్జ్ బుర్రు శేఖర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్రు శ్రీధర్‌నాయుడు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీను పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

బనగానపల్లె రూరల్ : డప్పు, చర్మ కళాకారులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండువీరయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో మాదిగల కురుక్షేత్ర మహాసభ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దండు వీరయ్య మాట్లాడుతూ చర్మ,డప్పు కళాకారులకు పింఛన్ రూ.6 వేలకు పెంచాలని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ బీల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపాలన్నారు.



ప్యాపిలిలో వృద్ధుడికి బీపీ పరీక్షిస్తున్న వైద్యులు



బేతంచెర్ల: అంబాపురంలో రోగులకు మందులు,కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బుగ్గన



హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్



టోకెన్లను పంపిణీ చేస్తున్న షేక్ ముస్లిం కార్పోరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్

ప్రతిఒక్కరికీ ఆరోగ్య భద్రత

● ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, వైద్య వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్ ఇంటింటికి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం ఎంపీడీఓ శివ రామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి వైద్య సిబ్బంది ఏడు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే కాటసాని కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రజలందరూ వెల్లువలా తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. గ్రామంలో 93శాతం మంది ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోను ఇలాంటి కార్యక్రమంలేదన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు.

హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌నకు విశేషస్పందన లభించింది. చర్మ వ్యాధులు, చిన్న పిల్లలు, స్త్రీల సంబంధించిన వ్యాధులు, బీపీ, షుగర్, పక్షవాతం, గుండె తదితర వ్యాధులకు సంబంధించిన 501 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కాటసాని ఓబులరెడ్డి, సర్పంచ్ టి హరిత, ఎంపీటీసీ వెంకటలచ్చమ్మ, వైద్యులు డాక్టర్ శివశంకరుడు, ఫిరోజ్, లతా, కళ్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి నడిపి వెంకట్‌రెడ్డి, రామేశ్వరరెడ్డి, అంబాపురం శ్రీనివాసరెడ్డి,గడ్డం పెద్దనాగేశ్వరరెడ్డి, రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసాదరెడ్డి మాజీ సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో వృద్ధురాలికి కంటి అద్దాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

పేద ప్రజలకు మరింత ఆరోగ్య సురక్ష

అవుకు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు మరింత ఆరోగ్య సురక్ష లభిస్తుందని అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సంగపట్నంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక హెల్త్ క్యాంప్‌నకు ఆమె హాజరయ్యారు. వైద్యులు జయేంద్ర రెడ్డి, యమునా, ప్రత్యేక వైద్య నిపుణులు జనార్ధన్, చిన్న లింగన్నలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె ప్రజలకు వైద్యాన్ని ప్రభుత్వం ఈ క్యాంప్ ద్వారా మరింత చేరువ చేస్తున్నదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 18 మందికి కంటి అద్దాలను, పీఎంజేవై కార్డులను జెడ్పీటీసీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు,ఎంఈఓ శ్రీధర్ రావు, సర్పంచ్ కె.శ్రీలక్ష్మీ, కార్యదర్శి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సంగపట్నంలో కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ

ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు కిటకిటా!

కొలిమిగుండ్ల: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఇప్పటికే ఆసుపత్రులను తీర్చిదిద్దడంతోపాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చిన సీఎం...ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటి సర్వే అనంతరం మండల పరిధిలోని బెలుం గ్రామం ప్రాథమిక మెయిన్ పాఠశాల ప్రాంగణంలో శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. బెలుం సచివాలయం పరిధిలోని బెలుంతోపాటు బెలుంశింగవరం గ్రామాల ప్రజలు మెడికల్ క్యాంప్‌కు తరలిరావడంతో ఆ ప్రాంగణ కిటకిటలాడింది. ఉదయం 7గంటల నుంచే పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి పేర్లు నమోదు చేసుకున్నారు. నంద్యాల నుంచి వచ్చిన గైనకాలజిస్ట్ డాక్టర్ సుధా ప్రియాంక, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ హరిచరణ్‌రెడ్డి, జనరల్ డాక్టర్లు కల్యాణ్‌శ్రీనివాస్, శ్రీనివాసరావు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, గుండె, కంటి పరీక్షలు, అన్నిరకాల సాధారణ జబ్బులకు 510 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్యులు సూచించిన ప్రకారం రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ప్రత్యేకించి దాదాపు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ క్యాంపుకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా ఉండేందుకు టెంట్లతో పాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. వృద్ధులు అసౌకర్యాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు రాజ్‌కుమార్, నాగార్జున, ఉపసర్పంచ్ బాచం మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సలోమి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాచం వెంకటసుబ్బారెడ్డి, దస్తగిరి, మొలక హుశేని, సుబ్బరాయుడు, బాషా, సచివాలయ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లెరూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని షేక్ ముస్లిం కార్పోరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్ సూచించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని సచివాలయం -4 పరిధిలో ఆరోగ్య సురక్ష కార్య క్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అబ్దుల్‌ఖైర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వైద్య సిబ్బందిని ప్రతి ఇంటి వద్దకు వచ్చి కుటుంబా లోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను సేకరించారన్నారు. అనంతరం ప్రత్యేక వైద్య శిబిరానికి వచ్చేందు కు రోగులకు ఆయన టోకెన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగలక్ష్మీ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ : ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని గుమ్మకొండ గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా ప్రైమరీ హెల్త్ సెంటర్లలో నలుగురు వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టులు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, తహసీల్దార్ విద్యాసాగర్, డాక్టర్లు మధులిక, అనిత, నిఖిల్, శ్రీకాంత్,భూపాల్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

ప్యాపిలి: పేదల ఆరోగ్యానికి సంపూర్ణ భరోసా కల్పించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో జనరల్ ఫిజిషియన్ రాజ్‌కుమార్ రెడ్డి, చిన్న పిల్లల వైద్యులు కళ్యాణ్ బాబు, ప్యాపిలి, జలదుర్గం పీహెచ్‌సీ వైద్యులు నితీశ్ కుమార్, నుస్రత్ ఉ జొహర, వాణిశ్రీ తదితరులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణానికి చెందిన 317 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో ఏడుగురిని డోన్, కర్నూలు ప్రభుత్వాసుపత్రులకు సిఫారసు చేశారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డీటీ మారుతి తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రజలకు గ్రామస్థాయిలో వైద్య సేవలు

బేతంచెర్ల: ప్రజలకు గ్రామ సచివాలయ స్థాయిలో వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని అంబాపురంలో ఎంపీడీఓ వెంగన్న, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనావాసులు, ఎంపీటీసీ రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఎంపీపీ ప్రారంభించారు. వైద్యులు సాగరిక, వెంకటేశ్వర్లు, మౌనిక, భార్గవి, శాంతి , ఆరోగ్య సిబ్బంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, యాదగిరి వెంకటేశ్వర్లు, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

డోన్ : జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ప్రజలు బీపీ, యూరిన్, షుగర్, మలేరియా, గల్ల పరీక్ష, హిమోగ్లోబిన్ పరీక్షలను చేయించుకున్నారు.

స్టాల్‌లు పరిశీలించిన చైర్మన్

స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జగనన్న సంపూర్ణ పోషణ స్టాల్‌ను శనివారం మునిసిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, కమీషనర్ వెంకట్రామిరెడ్డి, ఐసిడిఎస్ అధికారిని షంషాద్‌బేగంలతో కలిసి చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలను ఆయన పరిశీలించారు.

వైద్య పరీక్షలు బాగా చేశారు...



దగ్గు, ఆయాసం ఎక్కువగా ఉంటే ఇక్కడికి వచ్చి చూపించుకున్నా. డాక్టర్లు వైద్య పరీక్షలు బాగా చేశారు. ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. ఇంతకు ముందు కొలిమిగుండ్ల, బనగానపల్లెకు పో తుండే దాన్ని. ఇక్కడ ఏర్పాటు చేయడం మాలాంటి ముసలోళ్లకు చాలా మేలు జరిగింది. ప్రవేట్ ఆసుపత్రులకు పోతే వేలల్లో ఖర్చు అవుతుండేది. ప్రభుత్వం చాలా మంచిపని చేసింది. – దుర్గమ్మ, బెలుం

సేవలు అమోఘం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నేను ఇంత వరకు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న. డాక్టర్లు బీపీ, షుగర్, రక్తం, థైరాయిడ్ పరీక్షలు చేశారు. అదేవిధంగా మందులు అంజేశారు. గతంలో ఈ విధమైన వైద్య శిబిరాలు ఏ ప్రభుత్వాలు చేయలేదు. ఇంటి వద్దకు వైద్య సౌకర్యం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఎస్ వెంకటరాముడు, పేషెంట్, వెంకటాపురం

మందులు అందజేశారు



ఈ చిత్రంలో ఉన్న చాకలి లక్షమ్మ (52) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఈమెకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. గ్యాస్ సమస్యతో బాధపడుతుందని నిర్ధారించారు. దీంతో మందులను అందజేశారు. గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి ది గ్రామానికి వచ్చిన వైద్యులు, సిబ్బంది నా వ్యాధిని నిర్ధారణ చేయడమే కాకుండా మందులు అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.

– చాకలి లక్షమ్మ

మా ఊరికే వచ్చారు..



ఏ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మా ఊరికే వచ్చి అన్ని మందులను అందిస్తుండటం ఎంతో సంతోషంగా ఉంది. మెడికల్ క్యాంప్‌లో వివిధ రకాల విభాగాలను ఏర్పాటు చేసి అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను తక్షణమే ఇస్తున్నారు. నేను కొంతకా లంగా కాళ్ల నొప్పులతో, దగ్గు, జలుబు, ఆయసంతో ఇబ్బంది పడుతున్నాను. నాకు వైద్యులు ఇక్కడే పరీక్షలు చేసి మాత్రలు, టానిక్స్ ఉచితంగా ఇచ్చారు.

– కె. వెంకటేశ్వరమ్మ , సంగపట్నం గ్రామం

కంటి అద్దాలతో పాటు మందులు ఇచ్చారు



ఈ చిత్రంలో ఉన్న ఈడిగ భగవంతప్ప(68) గత కొన్ని రోజులుగా కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. కూలీ పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం గ్రామ సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు కింద కంటి పరీక్షలు నిర్వహించారు. శనివారం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడమే కాకుండా, మందులను అందజేశారు. దీంతో వృద్ధుడు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

– ఈడిగ భగవంతప్ప

అక్టోబర్ చివరికి తాగునీరు సరఫరా



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

బేతంచెర్ల: గోరుకల్లు రిజర్వాయర్ ద్వార వాటర్ గ్రిడ్ పథకం కింద అక్టోబర్ చివరినాటికి లేదా నవంబర్ 2వ తేదీకి బేతంచెర్ల పట్టణానికి మొదటి విడతలో తాగునీటి సరఫరాను ప్రారంభిస్తామని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిల్ సభ్యుల సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా 20 వార్డులో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పై చర్చించారు. పట్టణంలో 3.70 కోట్లతో నూతనంగా కందకం అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో పనులు చేపట్టడం జరుగుతుందని చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. అలాగే స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా కాలనీలను పరిశుభ్రంగా ఉంచడానికి కౌన్సిలర్లు ప్రజలను చైతన్యం చేయాలని కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం కింద ఇళ్లు, పరిశ్రమలను రీ సర్వే చేయడం జరుగుతుందని టౌన్ ప్లానింగ్ అధికారి అంజద్ బాషా తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, వార్డు కౌన్సిలర్స్ ఇబ్రహీమ్, హుసేన్‌బీ, షేక్ ముబీనా, ఎంగమ్మ, నాగజ్యోతి, మహేశ్వరి, సాయి, మధు, కోట్ల మధు, కో ఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ బూత్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం డోన్ నియోజకవర్గ అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకులతో బూత్‌ల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉపయోగించుకోన్న భవనాలు,స్థలాలు ప్రస్తుతం అక్కడ ఉన్న పరిస్థితులు తదితర వాటిని పరిశీలించి విషయాన్ని వివరించారు. కొన్ని హాబిటేషన్ గ్రామాలకు చెందిన ఓటర్లు ఇతర గ్రామాలకు వెళ్లి ఓట్లు వేసే పరిస్థితిపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల తహసీల్దార్లు విద్యాసాగర్, నరేంద్రనాథ్‌రెడ్డి, రవీంద్రవర్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, జెడ్పీటీసీ రాజ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మద్దిలేటి, జనార్ధన్, బీజేపీ నాయకులు రాజశేఖర్, సీపీఎం నాయకులు నక్కి శ్రీకాంత్, టీడీపీ నాయకులు మధుసూదనగౌడ్,శ్రీనివాసులు, సీపీఐ నాయకుడు పులిశేఖర్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

డోన్ టౌన్ : ఈ క్రాప్ పంట నమోదు ప్రక్రియను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, డోన్ డివిజన్ ఉప సంచాలకులు అశోక్‌వర్ధన్ రెడ్డి పరిశీలించారు. మండలంలోని మల్కాపురం, ఉడుముల పాడు, కామగానికుంట్ల తదితర గ్రామాల్లో ఈ క్రాఫ్ బుకింగ్ చేసిన కొన్ని సర్వేంబర్లను క్రాస్ చెకింగ్ చేశారు. అనంతరం వారు రైతు భరోసా కేంద్రాల్లో చేస్తున్న ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫి,గ్రామ వ్యవసాయ సహాయకులు నాగసులోచన, ఆనంద్, హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణంలోని తారకరామనగర్ ప్రాంతంలో విద్యుత్ పాత స్తంభాలు తొలగించి కొత్తవి వేస్తున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలోతెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వెనుక, తారకరామనగర్, అక్షర స్కూల్, కేఈ కృష్ణమూర్తినగర్ తదితర కాలనీల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు ఉండదని ఆయన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కొలిమిగుండ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్ ఎం బాలసుబ్బారెడ్డి సూచించారు. నాదేశం–నాజన్మ భూమి కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలు, మొక్కలు పట్టుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడే మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, హుశేనయ్య, మహేశ్వరరెడ్డి, చెన్నకేశవులు, పీరాసాహెబ్, జ్యోతి, జానకి పాల్గొన్నారు.

వంట ఏజెన్సీలకు పాత్రలు పంపిణీ

కొలిమిగుండ్ల: పాఠశాలల్లో నిర్వహిస్తున్న గోరుముద్ద వంట ఏజెన్సీలకు ప్రభుత్వం మంజూరు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్ వంట పాత్రలను శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ రాజయ్య అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు గోరుముద్దలో మెనూ తప్పక పాటించేలా పర్యవేక్షించాలని ఎంఈఓ సూచించారు.

గృహ నిర్మాణాల పరిశీలన

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల, ముక్కమల్ల గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను శనివారం హౌసింగ్ ఏఈ బాల చంద్రుడుతో కలసి ఎంపీడీఓ నాగకుమార్ పరిశీలించారు.లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బిల్లు పడుతున్నాయని, త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాని సూచించారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్ : మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాయంలో ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం అమలు చేయడంతో ఎంతో మంది పేద, మధ్య తరగతికి వారు ఉన్నత విద్య అభ్యసించి,దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి కంటే రెండు అడుగులు ముందు కేసి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారంచుట్టి మన బడి నాడు నేడు పేరుతో కోట్లాది రూపాయాలు విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అమ్మ ఒడి,ఫీజు రియంబర్స్‌మెంట్,విద్యాదీవెన, వసతి దీవెన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలు చేయడం జరుగుతుందన్నారు.

జాబ్‌మేళాలో 250 మందికి ఉద్యోగాలు

బనగానపల్లెరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా జాబ్ మేళా ద్వారా 250 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి. వీరికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

బనగానపల్లె : ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణం భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రులను మెరుగు పరచడంతోపాటు పూర్తి స్థాయిలో డాక్టర్లతోపాటు సిబ్బందిని నియమించారన్నారు. అదేవిధంగా ఫ్యామిలీ డాక్టర కాన్సెప్ట్ ద్వారా డాక్టర్లు, సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. పేదల ఆరోగ్యానికి మరింత భద్రత కల్పించేందుకు సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకా చుట్టారని, ఈ మేరకు ప్రజల ఆరోగ్య స్థితులను తెలుసుకునేందుకు వైద్య సిబ్బంది ఇంటింటి చేశారన్నారు. సెప్టెంబరు 30 నుంచి 45 రోజుల పాటు ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్వచ్ఛందంగా సేవలు అందజేసేందుకు సీనియర్ వైద్య నిపుణులు, వైద్యకళాశాలల పీజీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ ఎన్జీఓ వైద్య బృందాలు ముందుకు వస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు

డోన్ టౌన్ : గాజులదిన్నె నుంచి డోన్‌కు మంచినీటి సరఫరా చేసే పైపులైన్‌కు శనివారం మున్సిపల్ సిబ్బంది యుద్ధ ప్రాదిపదికన మరమ్మతులు చేపట్టారు. మండలంలోని వెంకటాపురం చెరువు కింద, కృష్ణగిరి మండలం చిట్యాల వద్ద పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతుంది. దీంతో అధికారులు అప్రమత్తమై మరమ్మతులు చేయించారు.